

(క్రిందటి సంచిక నుంచీ కొనసాగింపు)

2020- ఆగస్టు

"ఈ లాక్ డవున్ కాదు కానీ, నా చావుకొచ్చింది! ఇంటిల్లిపాది ఇంటిపట్టునే వుంటే వొండలేక ప్రాణాలు పోతున్నాయి. ఒక్కళ్ళకీ ఒక్క పనీ చేతకాదు, ఇష్టమూ వుండదు. మరి అమ్మ నలుగురి పని వొక్కతే ఎలా చేసుకుంటుందోనన్న ఇంగితమూ వుండదు. పనిమనిషి రాదు! ఆఫీసు పని తెగదు! అమ్మా, ఇడ్లీలు చేస్తావా, పూరీలు చేయవా అంటూ ఫర్మాయిషీలూ! టీ కప్పులూ, కాఫీ కప్పుల ప్రవాహం అయితే ఆగే చాన్సే లేదు. నాన్నని చూసి ఆరు నెలలు కావస్తుంది. పాపం, ఏం వొండుకుంటున్నారో ఏమో! ఒక్కసారి ఈ లాక్ డవున్ తీస్తే వెళ్ళి ఆయనని ఇంటికి తీసుకొస్తాను!" భాను గొణుక్కుంటూంది.

"హేపీ బర్త్‌డే భానూ", తలుపు దగ్గర అశోక్ గొంతు విని తలెత్తింది భాను. ఆమె చిరాకంతా మాయమయింది.

"హేపీ బర్త్‌డే అశోక్! అందులోనూ, యూ ఆర్ టర్నింగ్ ఫిఫ్టీ!"

"అవును కదా! యాభై యేళ్ళు! ఎంత తొందరగా పెద్దయి పోయాం భానూ! ఇంకా చిన్నప్పటి వయసులోనే వుంటే ఎంత బాగుండేది కదా?" డ్రీమీగా అన్నాడు. నవ్వింది భాను.

"ఇప్పుడు మాత్రం మనకేం తక్కువ అశోక్?"

"మరి ఇందాకణ్ణుంచీ అందరినీ తిడుతున్నావ్?"

మళ్ళీ స్టవ్ వైపు తిరిగింది భాను.

"ఇంటి పనీ, ఆఫీసు పనీ, చాలా విసుగ్గా వుంది అశోక్!"

"ఐ అండర్‌స్టాండ్. ఇవాళ అందరికీ గిన్నెలు కడిగే పనీ, బట్టల పనీ వంతులు వేద్దాం."

"పాల పేకెట్లు బయట వున్నాయి. కొంచెం లోపలికి తెచ్చి వాటిని కడిగేయ్ అశోక్. నాకు ఎనిమిదిన్నర నించి మీటింగ్ వుంది. ఇడ్లీలు హాట్ బాక్స్ లో పెట్టాను. అత్తయ్యకీ, పిల్లలకీ పెట్టి నువ్వు తినేయి. అనూకి తన లాప్ టాప్ వై-ఫైకి కనెక్టవుతున్నట్టు లేదు. అది కొంచెం చూడు." హడావిడిగా కాఫీ కప్పులో పోసుకొని బయటికి వెళ్ళిపోయింది.

నిట్టూర్చి బయటికి నడిచాడు అశోక్. హాల్లో సుమతి టీవీ చూస్తోంది. ఒక దాన్లో డాక్టరు గండం గడిచినట్టే అంటున్నాడు. ఇంకో చానెల్లో ఇంకో డాక్టరు ముందుంది ముసళ్ళ పండగ అంటున్నాడు. వార్తలూ,పుకార్లూ వినీ వినీ పిచ్చెత్తి పోతుంది, అనుకుంటూ టీవీ ఆపేసి లోపలికెళ్ళిపోయింది ఆమె.

అనఘు బయటికొచ్చింది.

"అనూ! ఇంకా స్నానం చేయలే? క్లాసులు మొదలవుతాయి కదా? లేటవుతుంది. లే, గెట్ రెడీ!" చింపిరి జుట్టూ, పాత నైటీలో వున్న కూతుర్ని చూసి చిరాగ్గా అన్నాడు అశోక్.

"నాన్నా, ఆన్-లైన్ క్లాసులు కెమెరా ఆఫ్ చేసి కూర్చుంటా. నా మొహం కానీ, బట్టలు కానీ ఎవరికీ కనపడవు, సో నో వరీ!" నిర్లక్ష్యంగా అంది అనఘు, లాప్ టాప్ తెరుస్తూ.

"స్నానమూ, శుభ్రతా, హైజీనూ ఇతర్ల కోసం కాదు, మన కోసం. ఆ అవతారంలో వాళ్ళు చెప్పే పాఠాలేవైనా నీ బుర్రలోకెక్కుతాయా? రేపణ్ణించి శుభ్రంగా తయారయి క్లాసులో కూర్చో, ఎండ్ డోంట్ ఆర్గ్యూ విత్ మి!"

తండ్రి మాటలకి మొహం ముడుచుకుంది అనఘు.

"ఇంతకీ అన్నగారేరీ?" పేపరు మడుస్తూ అడిగాడు.

"ఆయన గారు రాత్రంతా ఓటీటీలో అన్ని భాషల సినిమాలు చూసి యే తెల్లవారు జామునో పడుకుంటాడు. మధ్యాహ్నానికి కానీ మేలుకోరు. నాకయితే ఇన్నిన్ని రూల్సు! వాణ్ణేమీ అనరు."

"యెందుకనను? క్రమశిక్షణా ఆడ పిల్లలైనా, మగపిల్లలైనా అలవాటు చేసుకోవలసిందే!"

"క్రమ శిక్షణ అంటే?" మొహం పైకి పడుతున్న జుట్టు పైకి తోసుకుంటీ అడిగింది.

"నా ఖర్మ! ఇటు తెలుగూ రాదు, అటు ఇంగ్లీషూ రాదు! క్రమశిక్షణ అంటే డిసిప్లీన్! కనీసం మొహమైనా కడుక్కుంటే ఇడ్లీలు పెడతాతిను!"

"ఐ హేట్ ఇడ్లీస్!"

"అవునా? రేపణ్ణించి నువ్వు బ్రేక్‌ఫాస్ట్ వొండు. అప్పుడు అందరినీ కనుక్కొని ఎవరికి నచ్చిన వంట వాళ్ళకి చేద్దువుగానిలే! ఇవాళ్టికి అమ్మ చేసిన ఇడ్లీలు తిను!"

"హేపీ బర్త్‌డే నాన్నా!" భార్గవ్ వెనకనించి వొచ్చి, తండ్రి చేతిలో ఒక గ్రీటింగ్ కార్డ్ పెడుతూ అన్నాడు.

"కార్డ్ ఎలా సంపాదించావ్?" ఆశ్చర్యంగా అడిగింది అనఘు.

"కొనలే, నేనే తయారు చేసా! అందులోనూ, ఫిఫ్టియెత్ బర్త్‌డే కదా, స్పెషల్‌గా వుండొద్దు మరీ?"

"ఇంతకీ రాత్రి ఏ సినిమాతో తెల్లారింది తమరికి?"

"నాన్నా! డిస్కవరీ ఆఫ్ ది సెంచురీ యేమిటో తెలుసా? మళయాళం సినిమా! అంత అద్భుతంగా ఎలా తీస్తారో! నన్నడిగితే కోవిడ్ రావడం మనందరి అదృష్టం!"

నవ్వుకున్నాడు అశోక్,భార్గవ్ మాటలకి. యెంత అందమైన, ఉత్సాహ పూరితమైన వయసు! ప్రపంచం ఒక అద్భుతంలా, అందమైన మాయలా కనపడుతూ, వుండే అందమైన తూగుటూయల. తనకా వయసు దాటిపోయి, ఇవాళ్టితో యాభై యేళ్ళు నిండి, బ్రతుకు నడి మధ్యలో నిలబడ్డట్టుంది. యాభైయ్యవ పుట్టినరోజు. ఎంతో ప్రత్యేకంగా అనిపిస్తూంది. అంతలోకే చాలా మామూలుగానూ అనిపిస్తూంది.

★★★★★★★★★★★★★★★★★★★★★

2021-ఆగస్టు

"ఎవరెవరొస్తున్నారమ్మా పార్టీకి?" మంచినీళ్ళ జగ్గూ, కూల్ డ్రింక్స్ పెట్టిన జగ్గూ టేబుల్ మీద పెడుతూ అడిగాడు భార్గవ్.

"అంతా మా కాలేజీ ఫ్రెండ్స్, అయిదారుగురు వొస్తారు."

"నువ్వూ నాన్నా వేరు వేరు కాలేజీలు కదా?ఇద్దరికీ ఒకే సెట్టు ఫ్రెండ్స్ ఎలా వున్నారు?" కుతూహలంగా అడిగాడు.

"అదా! అదొక పెద్ద కథ!" నవ్వింది భాను.

"అవునూ, అసలు నువ్వు నాన్నా ఎలా కలిసారు? మీరిద్దరూ ఒక కాలేజీ కూడా కాదు కదా?" అక్కడే గిన్నెలో వున్న అప్పడం విరిచి నోట్లో వేసుకుంటూ అడిగింది అనఘ.

"ముందా అప్పడాలు తినడం ఆపు. ఒకరోజు నాన్న నెమ్మదిగా వాకింగ్ చేస్తూ వెళ్తుంటే నేను సైకిలు పై వెళ్తూ కింద పడేసాను. పాపం దెబ్బలు తగిలాయేమో అని, కిందపడ్డ మనిషిని లేపి ఇంటికి తీసికెళ్ళాను."

"సైకిల్ టక్కర్ తో షురూ అయిన ప్రేం కహానీ!" భార్గవ్ మాటలకి నవ్వింది అనఘ.

"సేనిటైజర్ బాటిల్ తలుపు దగ్గరే పెట్టు అశోక్!" భాను వున్నట్టుండి గుర్తు చేసింది.

"అమ్మా,ఇప్పటికి సేనిటైజర్ బాటిల్ గురించి ఇప్పటికి వెయ్యి సార్లు గుర్తు చేసావు. రిలాక్స్! అయినా, ఎవరి బాటిల్ వాళ్ళు తెచ్చుకుంటారు కూడా!" అనఘ విసుగ్గా అంది.

"అవును అనూ, కానీ, ఏ మాత్రం అజాగ్రత్తగా వున్నా, ఇన్‌ఫెక్షన్ సోకిందంటే...." భయంగా ఆగిపోయింది భాను.

ఏడు గంటలు కావొస్తూ వుండగా, డోర్ బెల్లు మోగింది. దాదాపు రెండేళ్ళ తరవాత, ఇంటికి అతిథులు! కొంచెం వింతగా, అలవాటు తప్పినట్టనిపించింది. మెల్లిగా లేచి తలుపు కొంచెం తెరిచింది భాను. శివ లోపలికి రాకుండా బయటే నిలబడి,

"హలో! టెంపరేచర్ చూపించాలా మేడం?" తల మాత్రం లోపలికి పెట్టి అన్నాడు.

"చాల్చాల్లే, లోపలికి రా! సూసీ యేది?" నవ్వుతూ తలుపు పూర్తిగా తెరిచింది భాను.

ఒకసారి పళ్ళన్నీ కనిపించేలా నవ్వి, మళ్ళీ మాస్కు వేసుకున్నాడు శివ. అతని వెనకాలే వొచ్చింది సూసీ.

"యెన్నేళ్ళయింది సూసీ, మనం కలుసుకోని!" భాను కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి కానీ, స్నేహితురాలిని హత్తుకోకుండా, చేయిపట్టుకొని నొక్కి వదిలింది భాను. సూసీ ఇబ్బందిగా నవ్వి, ముందు సేనిటైజర్ చేతిలోకి తీసుకొని చేతులు శుభ్రంగా తుడుచుకుంది. అందరి వైపూ పలకరింపుగా చూసినా,ఆమె చూపుల్లో ఏదో ప్రశ్న,సందేహం కదులుతున్నాయి. వీళ్ళల్లో ఎవరికైనా దగ్గూ జ్వరమూ వున్నాయా? ఇక్కడికి వొచ్చి తప్పు చేస్తున్నారా?

అనఘ ట్రేలో తెచ్చిన మంచి నీళ్ళు కూడా సందేహంగా తీసుకుంది.

"ఆశా, కోమలీ కూడా వొస్తున్నారా?" సూసీ అంటూ వుండగానే, కోమలి లోపలికొచ్చింది. మాస్కులోంచే నవ్వు మొహం తెలుస్తూ వుంది.

"కోమలీ! బాగున్నావా?" అశోక్ ఆమే చేతిలో బాగ్ అందుకొని టేబుల్‌పైన పెడుతూ అన్నాడు.

"ఇంతకీ చీఫ్ గెస్ట్ ఎక్కడ?" అడిగింది కోమలి.

"చీఫ్ గెస్టా?" అయోమయంగా అడిగింది భాను.

"అదే, సేనిటైజేషన్ బాటిల్!" చుట్టూ చూస్తూ అడిగింది కోమలి.అందరూ నవ్వారు. ఆమె చేతికి బాటిలందించాడు భార్గవ్.

"భార్గవ్ చాలా పొడుగయ్యాడు!"చేతులు రుద్దుకుంటూ అంది కోమలి.

"థాంక్స్ ఆంటీ!" సిగ్గు పడ్డాడు భార్గవ్.

"హేపీ బర్త్‌డే భానూ!" కోమలి వొచ్చి భానుని హత్తుకుంది.

"ఆశా, శరత్ వాళ్ళూ వొస్తున్నారా?" శివ అడిగాడు.

"వాళ్ళు మలక్‌పేట్ నుంచి రావాలి.కొంచెం లేటవ్వొచ్చని అన్నారు." ప్లేట్లు సర్దుతూ అన్నది భాను.

"ఇంకా చాలా మంది గెస్టులొస్తారా భానూ?" సూసీ కొంచెం అనీజీగా అడిగింది.

"ఇంతే సూసీ! జస్ట్ మన చిన్నప్పటి ఫ్రెండ్స్," అశోక్ అన్నాక సూసీ రిలాక్స్ అయింది. నిజానికి వాళ్ళకీ ఒంటరితనం చాలా విసుగ్గా వుంది. కరోనా దెబ్బకి డాన్సు స్టూడెంట్స్ అందరూ మానేసారు. శివ పనిలో తీరిక లేకుండా వున్నాడు. వర్క్ ఫ్రం హోం అని, ఇంటి పట్టునే వుంటున్నా, సూసీకి చాలా ఒంటరిగా అనిపిస్తూ వుంది. దాదాపు యేడాది తరవాత తోటి మనుషులతో పలకరింపులూ, మాటలూ, కలిసి కబుర్లు చెప్పుకుంటూ భోజనం చేయడం, అసలా ఊహకే చచ్చేంత ఉత్సాహం ముంచుకొచ్చింది సూసీకీ, శివాకీ.

ఆశా, శరత్ కూడా వొచ్చి చేరిన తరవాత కబుర్ల జోరు పెరిగింది. సేనిటైజర్‌తో కూరగాయలూ, పళ్ళూ కడగటం వర్ణించి శరత్ అందరినీ నవ్వించాడు. కోమలికి ఇంఫెక్షన్ సోకి ఒంటరిగా ఇంట్లో పడి వుంటే పక్క ఇంటి వారు పూట పూటా వంటా, కాఫీ తెచ్చి ఇంటి గుమ్మం ముందు పెట్టడం గురించి విని అందరూ కదిలిపోయారు. మాటల్లోనే

అందరూ వేక్సినేషన్‌లు వేయించుకున్న సంగతీ చెప్పుకున్నారు. ఇంటిల్లిపాదీ వర్క్ ఫ్రం హోం పేరుతో ఇంట్లోనే వుంటే వాళ్ళకి తిండీ, టిఫిన్లూ, కాఫీలూ అందించలేక తను పడ్డ అవస్థలు వర్ణించింది భాను.

వాట్స్‌ఆప్‌లో ప్రచారమవుతున్న పుకార్లూ, ఆస్పత్రుల అన్యాయాలూ, దూరమవుతున్న దగ్గరివాళ్ళూ, ఆందోళనలూ, సంతోషాలూ చెప్పుకున్నారు. అశోక్ నాట్య ప్రదర్శనల గురించీ, భాను బాడ్‌మింటన్ ఆటలనీ, చదువుకుంటున్న రోజుల్లో తమ సరదాలనీ తలచుకున్నారు.

" భానూ! ఫిఫ్టీ ఇయర్స్ ఓల్డ్! యాభై యేళ్ళు! అందరం పెద్ద వాళ్ళవుతున్నాం కదా? "ఆశా అన్నది.

"అవును! అసలు ఈ పార్టీ కిందటేడే ఇద్దామనుకున్నాం, అశోక్ యాభైయ్యవ పుట్టినరోజుకి. కానీ, కోవిడ్ అడ్డం పడేసరికి ఈ యేడు అందరం కలుసుకుందామని ఇలా ఏర్పాటు చేసాం," భాను అన్నది.

"అందులోనూ మీ ఇద్దరికీ పుట్టినరోజు ఒకటే కావటం భలే లిసొచ్చిందిలే!"అన్నాడు శివా, భోజనం ముగిస్తూ. నవ్వాడు అశోక్.

"అయినా, మీరిద్దరూ భలే వాళ్ళు. మీ వ్యవహారం మాకెవ్వరికీ తెలియదనుకున్నారు. ఇద్దరూ వారం వారం బ్రిటిష్ లైబ్రరీలో కలవడాలూ, మినర్వాలో కాఫీలూ, లంచులూ, మాకెవ్వరికీ తెలియదనుకున్నారిద్దరూ! " కోమలి అన్నది.

"వాళ్ళ మొహం. జగదేక వీరుడు అతిలోక సుందరి సినిమాలో కలిసినప్పుడే నా కనుమానం వొచ్చింది," అన్నది ఆశ. ఆ మాటలకి పిల్లలిద్దరూ అమ్మా నాన్నల వైపు కుతూహలంగా చూసారు.

నవ్వుల మధ్యలోనే భార్గవ్ లేచి వెళ్ళి కేకు తెచ్చాడు. ఇంట్లోనే తయారు చేసిన కేకు కావడంతో, కొంచెం ఎగుడు దిగుడుగా వుంది. కేకు మీద ఐసింగ్‌తో రాసిన "హేప్పీ" లో ఒక " పి " కనపడలేదు.

"మీ నాన్న ఇంగ్లీషు ప్రొఫెసరు, మీరేమో హేప్పీ స్పెల్లింగ్ మరిచిపోయారు!" శరత్ పిల్లలని ఉడికించాడు.

"మరిచిపోలేదంకుల్! కోవిడ్ టైంలో సంతోషం పూర్తిగా వుండదన్న విషయాన్ని విజువల్‌గ చూపించామంతే!" భార్గవ్ రిటార్ట్ ఇచ్చాడు.

" అమ్మో, మాటలు నేర్చిన వాడివే! వెరీ స్మార్ట్!" అతని భుజం తట్టాడు శివా.

అందరూ మాస్కులు కిందకి తోసుకొని కేకు టేబుల్ చుట్టూ చేరి నిలబడ్డారు. అందరికీ ఎందుకో మనసులు బరువెక్కాయి. రెండేళ్ళుగా చూసిన మృత్యు తాండవం దెబ్బలు తప్పించుకున్నామన్న ఆనందం పెద్దగా కనపడలేదు. మరణించిన స్నేహితులూ, పొరుగింటి వాళ్ళూ, పరిచయస్తులూ దూరపు బంధువులూ గుర్తొచ్చి కళ్ళు చెమర్చాయి. ఇకపైన తప్పకుండా ఒకరికొకరు ఫోన్లు చేసుకోవాలనీ, వీడియో కాల్సు చేసుకొని మాట్లాడుకోవాలనీ, నిశ్చయించుకొని విడిపోయారు.

★★★★★★★★★★★★★★★★

2021-డిసెంబరు

"అశోక్! లే! అశోక్, లెమ్మంటూంటే!" భాను కంగారుగా లేపుతూ వుంటే బలవంతంగా కళ్ళు తెరిచాడు అశోక్.

"అత్తయ్యకి కొంచెం ఒళ్ళు వెచ్చబడినట్టుంది. నాకేదో భయంగా వుంది, ఒక్కసారి వొచ్చి చూడు!" ఒక్కసారి ఒళ్ళు ఝుల్లుమంది అశోక్‌కి. అమ్మకి జ్వరమా? కోవిడ్ కాదు కదా! లేచి కళ్ళ జోడు పెట్టుకొని భాను వెనకే తల్లి గదిలోకి నడిచాడు.

"అమ్మా! యేమయింది?"

ఆవిడ నీరసంగా కళ్ళు తెరిచింది.

"యేం లేదురా! భాను ఊరికే కంగారు పడుతుంది. కొంచెం నీరసంగా వుంది ఇవాళ. పెద్ద వయసవుతుంది కదా, అంతే! మీరు వెళ్ళండి." మళ్ళీ కళ్ళు మూసుకుంది ఆవిడ. భార్గవ్ ఈలోగా థర్మా మీటర్ తెచ్చి ఆమె నుదుటికానించి చెక్ చేసాడు. తొంభై తొమ్మిది డిగ్రీలు చూపించింది. ఎటూ తేల్చుకోలేని నంబరు. జ్వరం వున్నట్టా, లేనట్టా?

"నాన్నా! నానమ్మని హాస్పిటల్‌కి తీసికెళ్దామా?" అనఘ తండ్రి పక్కన చేరి అడిగింది. హాస్పిటల్ మాట తలచుకోగానే అశోక్‌కి గుండెదడ దడలాడింది. భార్గవ్ తన ఫోన్‌లో గూగుల్ తెరిచి నానమ్మ సింప్టంసూ, టెంపరేచరూ పెట్టి అది కోవిడ్ అయే ఛాన్సుందో లేదో చెక్ చేస్తున్నాడు. అశోక్ భాను వెనకే వంటింట్లోకి వెళ్ళాడు.

"యేం చేద్దాం భానూ?" బేలగా అడిగాడు.

"అశోక్, కాం డవున్! మనం కంగారు పడితే, అత్తయ్య కూడా కంగారు పడతారు. ఇవాళ రాత్రి వరకూ చూద్దాం. నేను ఆఫీసుకి సెలవు పెడతాను, ఆవిడ పక్కనే వుండి చూసుకుంటాను. సరేనా?"

"నువు వర్కింగ్ ఫ్రం హోమె కదా? మళ్ళీ లీవెందుకు?"

"అశోక్! వర్క్ ఫ్రం హోం అంటే హాలిడే కాదు. చాలా పని వుంది,పైగా ఇవాళ చాలా మీటింగ్సు కూడా వున్నాయి. ఆఫీసు పని చేస్తూ, అత్తయ్యని చూసుకుంటూ, రెండూ మేనేజ్ చెయ్యలేను."

"ఓకే, ఓకే, సారీ! నువ్వు అమ్మ దగ్గరుండు, నేనూ పిల్లలూ వంట పని చూస్తాం. అది సరే కానీ, ఇంట్లోకి బయటివాళ్ళెవరూ రాలేదు. అమ్మకి కోవిడ్ వచ్చే అవకాశం వుందంటావా?" ఆలోచనలో పడింది భాను. ఎవరొచ్చారు ఇంట్లోకి? కూరగాయలు తీసుకొచ్చాడు భార్గవ్. వాటిని అత్తగారు తీసి కోసారా? ఏమో మరి.

"అసలు ఆవిడకి కోవిడ్ అయి వుండదు కూడా! డిసెంబరు చలి, ఫ్లూ జ్వరాలు బాగా వొస్తున్నాయంటా! చూద్దాం." ధైర్యం చెప్పింది భాను. అశోక్ స్టడీ రూంలోకెళ్ళి ముందు శివాకి ఫోన్ చేసాడు. శివా సంగతంతా విని, తనకి తెలిసిన డాక్టర్ నెంబర్ ఇచ్చాడు. అశోక్ వెంటనే డాక్టర్‌కి ఫోన్ చేసాడు.

"చూద్దాం అశోక్ గారూ! భయపడకండి. టెంపరేచర్ మానిటర్ చేయండి. ఆకలి ఎలా వుందో చూడండి. దగ్గు వస్తుంటే చెప్పండి. ఇంట్లో ఆక్సీ మీటరుందా? ఇంట్లో బీపీ మానిటర్ వుంటే బీపీ కూడా చెక్ చేస్తూ వుండండి!" ఆ ఫోన్ కాల్ తరవాత అశోక్ అయోమయం ఇంకా ఎక్కువైంది.

మధ్యాహ్నానికి పెద్దావిడ కొంచెం లేచి నడవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. కానీ మళ్ళీ సాయంత్రానికి కొంచెం ఒళ్ళు వెచ్చబడిందావిడకి. రాత్రి ఏమీ తినబుద్ధవడం లేదని ఏమీ తినలేదావిడ. ఇంట్లో మిగతా నలుగురికీ ఆమె పరిస్థితి గురించి బెంగగా వున్నా, ఆవిడది నిజంగా కోవిడ్ అయితే తమకీ తగలొచ్చు అన్న భయమూ వుంది. వాళ్ళందరూ కోవిడ్ వేక్సిన్ తీసుకున్నారు కూడా. అందరూ కలత నిద్రే పోయారు.

మర్నాడు ఆవిడకి జ్వరంతో పాటు ఒళ్ళు నొప్పి కూడా మొదలైంది. అ రోజు కొంచెం ఊపిరి కూడా భారంగా తీసుకోవడం మొదలైంది. మామూలుగానే మాట్లాడుతూ వున్నా, అన్నం తినలేదు. సాయంత్రం అయ్యేసరికి అందరికీ మతి పోయినట్టైంది. హాస్పిటల్‌లో చేరిన వాళ్ళ గురించి ప్రచారంలో వున్న దరుణమైన కథలు గుర్తొచ్చాయి.

"నన్ను హాస్పిటల్ మాత్రం తీసుకెళ్ళొద్దు అశోక్! నేను బానే వున్నా!" సుమతి బలహీనంగా అన్నది.

ఈసారి డాక్టర్ అంత కాన్‌ఫిడెంట్‌గా మాట్లాడలేదు.

"రేపు ఉదయం కోవిడ్ టెస్ట్ చేయిద్దాం అశోక్ గారు.భయపడకండి!"

"రాట్ టెస్టు చేస్తే సరిపోదా డాక్టర్?" భార్గవ్ స్పీకర్ ఫోన్లో అడిగాడు.

"రాట్ టెస్టు చాలాసార్లు పాజిటివ్ కేసులను కూడా నేగెటివ్‌గా చూపించే అవకాశం వుంది బాబూ. అందుకని పూర్తి పరీక్ష చేయించడం మంచిది."

"ఓకే! అవిడ పెద్దావిడ. హాస్పిటల్ వెళ్ళి పరీక్ష చేయించాలంటే భయంగా వుంది. ఇంటికొచ్చి శాంపిల్ కలెక్టు చేసుకునే వాళ్ళున్నారా?"

" యెన్నేళ్ళుంటాయి మీ అమ్మగారికి?"

'షీ ఈజ్ సెవెంటీ,'' అశోక్‌కి మొదటిసారి చాలా దిగులుగా అనిపించింది.

★★★★★★★★★★★★★★★★★★

మర్నాడు కోవిడ్ పరీక్షకోసం శాంపిల్ కలెక్ట్ చేసుకోవడానికి మాస్కూ, సూటూ, కాళ్ళకీ చేతులకీ తొడుగులతో వచ్చాడు లాబ్ టెక్నీషియన్. సుమతి గదిలోకెళ్ళి శాంపిల్ తీసుకొని వెళ్ళిపోయాడు.

"మీరందరూ కూడా జాగ్రత్తగా వుండండి. మాస్కులేకుండా పెద్దావిడ దగ్గరికి వెళ్ళకండి. ఆవిడ దగ్గరికెళ్ళొచ్చిన తరవాత తప్పకుండా చేతులు శానిటైజ్ చేసుకోండి," చెప్పి వెళ్ళిపోయాడు.

"నాన్నా, ఈ కాలేజీ లెక్చర్స్ ఆన్-లైన్ క్లాసుల్లో అసలేమీ అర్థం కావడంలేదు. కెమిస్ట్రీ అయితే అసలొక్క ముక్క కూడా అర్థం కావడం లేదు. అకడెమిక్ ఇయర్ వేస్టయిపోతుందేమో. నాకు చాలా భయం వేస్తుంది నాన్నా!" అనఘు తండ్రి పక్కనే కూర్చొని చిరాగ్గా అంది.

అశోక్ అన్య మనస్కంగానే తల వూపాడు. భాను మాత్రం చురుగ్గా చూసింది. టెంత్ పరీక్షల ముందు 2020లో మొదలైన కోవిడ్ లాక్ డవున్! పిల్లలేం పరీక్షలు వ్రాసారో, ఏం రిజల్ట్స్ వచ్చాయో ఎవరికీ అర్థమూ కాలేదు, గుర్తూ లేదు. ఏదో ఒక కాలేజీలో చేర్పించారు నిరాసక్తంగా. చుట్టూ వున్న మనుషులు పిట్టల్లా రాలిపోతూ వుంటే, కాలెజీ సీట్ల కోసం ఎవరేడ్చారు!

కెమిస్ట్రీ అంటే తనకిష్టమని చెప్పి ఈ కాలేజీలో చేరింది అనఘు. ఇంటర్ ఫస్టియర్ క్లాసులన్నీ చాలావరకు ఆన్-లైన్‌లోనే జరిగిపోయాయి. చదువుతున్న సంతృప్తీ లేదు, సెలవులన్న ఆట విడుపూ లేదు. వొచ్చిన నాలుగక్షరాలూ మరిచి పోతున్నారేమో పిల్లలు. నిట్టూర్చింది భాను.

"డోంట్ వరీ అనూ. మా కొలీగ్ ప్రమీల కూతురు సమీర ఇంటర్ పిల్లలకి ట్యూషన్ చెపుతూంది. నిన్ను ఆమె క్లాసుల్లో చేర్పిస్తాను." భాను మాటలకి తల వూపింది అనఘు. అశోక్ ఇంకా పరధ్యానంగానే వున్నాడు.

అశోక్ అన్య మనస్కంగానే తల వూపాడు. భాను మాత్రం చురుగ్గా చూసింది. టెంత్ పరీక్షల ముందు 2020లో మొదలైన కోవిడ్ లాక్ డవున్! పిల్లలేం పరీక్షలు వ్రాసారో, ఏం రిజల్ట్స్ వచ్చాయో ఎవరికీ అర్థమూ కాలేదు, గుర్తూ లేదు. ఏదో ఒక కాలేజీలో చేర్పించారు నిరాసక్తంగా. చుట్టూ వున్న మనుషులు పిట్టల్లా రాలిపోతూ వుంటే, కాలెజీ సీట్ల కోసం ఎవరేడ్చారు!

కెమిస్ట్రీ అంటే తనకిష్టమని చెప్పి ఈ కాలేజీలో చేరింది అనఘు. ఇంటర్ ఫస్టియర్ క్లాసులన్నీ చాలావరకు ఆన్-లైన్‌లోనే జరిగిపోయాయి. చదువుతున్న సంతృప్తీ లేదు, సెలవులన్న ఆట విడుపూ లేదు. వొచ్చిన నాలుగక్షరాలూ మరిచి పోతున్నారేమో పిల్లలు. నిట్టూర్చింది భాను.

"డోంట్ వరీ అనూ. మా కొలీగ్ ప్రమీల కూతురు సమీర ఇంటర్ పిల్లలకి ట్యూషన్ చెపుతూంది. నిన్ను ఆమె క్లాసుల్లో చేర్పిస్తాను." భాను మాటలకి తల వూపింది అనఘు. అశోక్ ఇంకా పరధ్యానంగానే వున్నాడు.

ఆ రోజంతా సుమతి నీరసంగానే పడుకోనే వుంది. జ్వర తీవ్రత కూడా హెచ్చింది. ఆమె దగ్గూ ఆయసమూ చూస్తే వాళ్ళకి అది తప్పకుండా కోవిడ్ అయి వుంటుందనే అనిపిస్తుంది. ఆస్పత్రిలో చేర్పించక తప్పదేమో, కానీ ఆస్పత్రుల గురించిన వార్తలు భయంకరంగా వున్నాయి. అసలామెకు ఆస్పత్రిలో బెడ్డూ దొరుకుతుందో లేదో!

★★★★★★

మర్నాడు మధ్యహ్నానికి గానీ కోవిడ్ పరీక్ష రిజల్ట్స్ రాలేదు. మొబైల్ ఫోన్‌లో రిజల్ట్ చూడగానే అశోక్ వొణికిపోయాడు.

"భానూ! భానూ! అమ్మది కోవిడ్ రిజల్ట్ పాజిటివ్ వొచ్చింది!" పిల్లలిద్దరూ తండ్రి పక్కనే చేరి అతని చేయి పట్టుకున్నారు.

"ఇట్స్ ఓకే అశోక్. ముందు నువ్వు స్థిమిత పడు. నేను డాక్టర్‌కి ఫోన్ చేస్తాను."

డాక్టరూ ఎటూ చెప్పలేకపోయాడు.

"అవునండీ, ఆవిడకి కోవిడ్ వున్న మట నిజమే. అయితే ఆస్పత్రికి తీసికెళ్ళాలో వద్దో మీరే నిర్ణయించుకోవాలి. చాలా పెద్దావిడ. ఆస్పత్రిలో పడకలూ తేలిగ్గా దొరకటం లేదు. అక్కడ పరిస్థితులకి ఆవిడ తట్టుకోగలరో లేదో. ఇంట్లో అయితే మీ అందరి మధ్యా కొంచెం తేలిగ్గా కోలుకుంటారేమో!"

"కానీ, ఆవిడ చాలా ఆయసపడుతున్నారండీ! మాకు చాలాభయం వేస్తుంది!" భాను మాటలకి ఆయనా ఆలోచనలో పడ్డాడు.

"సరే, నాకొక గంట టైమివ్వండి. నాకు తెలిసిన నర్సింగ్ హోం లో ఆవిడని చేర్పించే ఏర్పాటు చేస్తాను. మీరు ఆవిడని వీలైనంత కంఫర్టబుల్‌గా వుంచే ప్రయత్నం చేయండి."

నలుగురూ వొంతులేసుకొని మాస్కులు కట్టుకొని ఆవిడ పనులు చేసుకున్నారు. భార్గవ్ స్నేహితుడొకడు తన దగ్గరున్న పల్స్ ఆక్సిమీటర్ తెచ్చి ఇచ్చాడు వాడుకోమని. ఆక్సిమీటర్ లో ఆవిడ ఆక్సిజన్ లెవెల్ చూసిన తరవాత అందరూ కొంచెం స్థిమిత పడ్డారు. ఆ నంబర్లు వాళ్ళనుకున్నంత ఘోరంగా లేవు. ఊపిరి భారంగా పీలుస్తూనే వున్నదావిడ. రాత్రయేసరికి అశోక్ ధైర్యం పూర్తిగా జారిపోయింది. తన డిపార్ట్‌మెంటు వాళ్ళని సంప్రదించి, ఇంకొందరు డాక్టర్లకి ఫోన్ చేసాడు. ఎవరూ ఏమీ చెప్పలేకపోయారు.

డాక్టర్ ప్రభాకర్ మర్నాడు ఫోన్ చేసాడు.

"అశోక్, మీరు అమీర్ పేటలో వున్న సుప్రజా నర్సింగ్ హోంకి వెళ్ళండి. అక్కడ మీకొక బెడ్డు ఏర్పాటు చేసాను. వెంటనే బయల్దేరండి. డబ్బు కూడా సర్దుబాటు చేసుకోండి. బీ క్విక్!"

భాను అప్పటికే చిన్న సంచీలో సుమతి బట్టలూ, టూత్ బ్రష్షూ, దువ్వెనా ఇంకొన్ని సామాన్లూ సర్ది కారులో పెట్టింది.

"నాకు బానే వుంది అశోక్! అనవసరంగా డబ్బు ఖర్చు చేసి ఆస్పత్రిలో చేర్పించకు!" ఆయాసపడుతూనే అంది సుమతి.

"అమ్మా, నీ పరిస్థితి అంత బాగా లేదు. రెండు రోజుల్లో నయమవగానే ఇంటికి తీసుకొచ్చేస్తా. భయపడకు," అశోక్ మాస్కులోంచి అన్నాడు.

ఆస్పత్రి బయటే సిబ్బంది ఆవిడని లోపలికి తీసికెళ్ళిపోయారు. కుటుంబ సభ్యులనెవరినీ లోపలికి రానీయలేదు. భానూ భార్గవ్ ఆస్పత్రి పేపర్ వర్కంతా పూర్తి చేసారు. అనఘు తండ్రి పక్కనే కూర్చుంది, అతనికి ధైర్యం చెప్పటానికి. వీల్ చెయిర్ పైన కూర్చొని వెడుతూ సుమతి వెనక్కి తిరిగి చూసింది.

"జాగ్రత్త నాన్నా!"

ఆవిడని లోపలికి తీసికెళ్ళిపోయారు.

★★★★★★★★★★

(కొనసాగింపు వచ్చే నెలలో)

COMMENTS